నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 19 డిసెంబర్ 2024 | SURYAPET

## ఏఎమ్మార్పీ ఆయకట్టుకు నీటి విడుదల షెడ్యూల్ ఖరారు

### వారబందీ పద్ధతిలో 120 రోజులు విడుదల

పెద్దఅడిశర్లపల్లి, డిసెంబర్ 18 : ఏఎమ్మార్పీ ఆయకట్టుకు యాసంగి సీజన్‌లో నీటి విడుదల షెడ్యూల్‌ను ఎస్‌ఈ అజయ్‌కుమార్ ప్రకటించారు. ఏఎమ్మార్పీ హైలెవల్ కెనాల్‌తోపాటు లోలెవల్ కూడా వారబందీ ( ఆన్ ఆఫ్ పద్ధతి)లో నీటిని విడుదల చేయనున్నారు. హైలెవల్ కెనాల్, లోలెవల్ కెనాల్‌కు డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 13వరకు నీటిని విడుదల చేయనున్నారు. డివిజన్ –4, డివిజన్–5 పరిధిలోని డిస్ట్రిబ్యూటరీలకు ఒక వారం, డివిజన్ –6, డివిజన్ –7 పరిధిలోని డిస్ట్రిబూటరీలకు మరొక వారం చొప్పున నీటి విడుదల చేయనున్నారు. మొత్తం 120 రోజుల పాటు నీటి విడుదల కొనసాగనుంది. రైతులు నీటిని వృథా చేయకుండా కాల్వకు గండ్లు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ఈఈలను ఎస్‌ఈ ఆదేశించారు. అన్ని డివిజన్ల అధికారులు అప్రమత్తంగా ఉండి చివరి ఆయకట్టు వరకు నీళ్లు చేరేలా చూడాలని సూచించారు.

# చేయూతకు చెయ్యి!

## ఆసరా పింఛన్ల పెంపు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం



### ఎన్నికలప్పుడు రూ.రెండు వేల పింఛన్‌ను రూ.నాలుగు వేలకు చేస్తామని హామీ

ఏడాది గడిచినా కేసీఆర్ ఇచ్చిన రూ.రెండు వేలతోనే సరిపెడుతున్న సర్కారు

దివ్యాంగుల పింఛన్‌నూ అంతే..

ఇంకెప్పుడు పింఛన్ పెంచుతారని ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

సూర్యాపేట, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలకు ఆశజూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గతేడాది కాలంగా మోసం చేస్తూ వస్తున్నది. ప్రధానంగా దేశంలోనే ఎక్కడా లేని విధంగా గత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆపన్నులను ఆదుకునేందుకు కనీవినీ ఎరుగని రీతిన రూ.2వేలకు పింఛన్లు పెంచి ఇవ్వగా అంతకు రెట్టింపు చేసి చేయూత పేరిట రూ.4వేలు ఇస్తామని కాంగ్రెస్ నమ్మించి నట్టేట ముంచుతున్నది. ఏడాది కాలంగా కేసీఆర్ ఇచ్చిన రెండు వేల రూపాయలతోనే సరిపెడుతున్నది. నెలనెలా పింఛన్ తీసుకునేందుకు వెళ్తున్న వృద్ధులు, వితంతువులు ఈ నెలైనా పింఛన్ పెరిగిందా అంటూ అధికారులను అడుగడం పరిపాటిగా మారింది. పింఛన్ పెంచుతామని చెప్పి మోసం చేసిన రేవంత్ సర్కార్‌పై వృద్ధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పింఛన్ల కోసం వేలి ముద్రలు వేస్తున్న పింఛన్‌దారులు(ఫైల్)

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమ రంగంలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తికరంగా సంక్షేమ ఫలాలు అందేలా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయనడంలో సందేహం లేదు. ప్రధానంగా కేసీఆర్ హయాంలో పింఛన్ల పంపిణీని సామాజిక బాధ్యతగా తీసుకొని దేశంలోనే ఏ రాష్ట్రంలో లేనంతగా ఇక్కడ అమలు చేశారు. ఏ దిక్కూ లేని వారందరినీ పింఛన్ల పరిధిలోకి తీసుకొచ్చి కేసీఆర్ కొండంత అండగా నిలిచారు. సమైక్య రాష్ట్రంలో రెండు వందల రూపాయాలు ఉన్న ఆసరా పింఛన్‌ను అమాంతం పెంచిన విషయం విదితమే. తొలుత దివ్యాంగులకు రూ.1,500, వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత కార్మికులకు రూ.1,000 చొప్పున అందించారు. సమాజంలో ఉండే ఒంటరి మహిళలకు సైతం పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించి వారికి సైతం ఇచ్చారు. కాగా పెరుగుతున్న ధరలతో పెన్షన్‌దారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన కేసీఆర్ 2018 శాసనసభ ఎన్నికల సమయంలో ఆసరా పెన్షన్లు పెంచాలని నిర్ణయించారు. ఆ తర్వాత వృద్ధులు, వితంతువులు, చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు రూ.2,016, దివ్యాంగులకు రూ.3,016 చొప్పున పింఛన్‌ను అమలు చేశారు. అంతేకాకుండా 65 సంవత్సరాల వయసు ఉన్నవారికి ఇచ్చే వృద్ధాప్య పెన్షన్‌ను 57 సంవత్సరాలకు కుదించి అమలు చేశారు.

**ఏడాది పూర్తయినా పట్టింపులేని కాంగ్రెస్**

బీఆర్‌ఎస్ హయాంలో ఆసరా పింఛన్లను అమాంతం పెంచి ఇవ్వగా, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పెన్షన్లను రూ.2 వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని, ఇంటికి ఒక్కరు కాదు ఇద్దరున్నా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీని మరిచిపోయారు. ప్రస్తుతం సూర్యాపేట జిల్లాలో 1,47,834 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయి. ఆరు గ్యారెంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత కింద రూ.4వేలు పెన్షన్ అందిస్తామని చెప్పింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పూర్తయినా ఇంత వరకు పింఛన్ల పెంపుదల లేదు. ప్రస్తుతం కొత్త దరఖాస్తుల స్వీకరణ లేదు. ఇచ్చిన హామీకి దిక్కులేకుండా పోయింది. దీంతో గ్రామాల్లో పెన్షన్ల పెంపు కోసం వృద్ధులు వేయి కండ్లతో ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం నెలకు 2,016 రూపాయలే చేతికి అందుతున్నది. అది కూడా కేసీఆర్ హయాంలో పెంచిన మొత్తమే కావడం గమనార్హం. వెంటనే రేవంత్ సర్కార్ తమకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.4వేలకు చేయాలని పింఛన్‌దారులు కోరుతున్నారు.

### పింఛన్ పెంచుతారని ఎదురుచూస్తున్నాం



ఎన్నికల ముందు కాంగ్రెసోళ్లు ముసలోళ్లకు పింఛన్‌ను 4వేలకు పెంచుతామని చెప్పిండ్రు. గెలిచి సంవత్సరం అయినా పెంచలేదు. ఎప్పుడు పెంచుతారోనని ఎదురు చూస్తున్నాం. ధరలేమో పెరిగిపోతున్నాయి..పింఛన్ డబ్బులే మాలాంటోళ్లకు ఆసరా. వెంటనే పింఛన్ పెంచి ఇవ్వాలి.

**-రెబ్బ రాములమ్మ, మాచవరం, హుజూర్‌నగర్ మండలం**

### నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ



4వేలకు పింఛన్ పెంచి ఇస్తామంటేనే కాంగ్రెస్ నమ్మి ఓట్లు వేశారు. కానీ ఏడాదైనా పెంచకుండా మోసం చేస్తున్నరు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇస్తామని చెప్పిండ్రు. ఇంట్లో ఇద్దరికి కూడా పెన్షన్ ఇస్తామన్నరు. కానీ పోయిన ప్రభుత్వంలో ఇచ్చినట్లే ఇస్తున్నరు. కొత్తగా రేవంత్ సర్కారు ఇచ్చిందేమీ లేదు.

**- జక్కి నర్సయ్య, అనంతారం, పెన్‌పహాడ్ మండలం**

### హామీ ఇచ్చి జరుపడం సరికాదు



పింఛన్‌ను 4వేల రూపాయలకు పెంచుతామంటేనే జనం కాంగ్రెసోళ్లకు ఓట్లు వేసి గెలిపించారు. పింఛన్లు పెంచకుండా ఏడాది కాలంగా ప్రజలను మభ్యపెట్టడం సరికాదు. కేసీఆర్ సర్కారు రెండు సార్లు పింఛన్ పెంచి నెలనెలా సమయానికి ఇచ్చింది. రేవంత్ సర్కారు వెంటనే పింఛన్లు పెంచి పేదలకు అండగా నిలువాలి.

**-నర్సమ్మ , రామాపురం, నడిగూడెం**

# డిజిటల్ బోధనకు తప్పని ఇబ్బందులు

- పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సౌకర్యమేది?
- సొంతంగా ఫోన్ నుంచి హాట్‌స్పాట్ ఉపయోగిస్తున్న టీచర్లు
- సిగ్నల్ లేక, నెట్ స్పీడ్ లేక మధ్యలోనే ఆగుతున్న పాఠాలు



నేరేడుచర్ల మండలం పెంచికల్‌దిన్నె జడ్పీహెచ్‌ఎస్‌లో డిజిటల్ బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

నేరేడుచర్ల, డిసెంబర్ 18 : ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం కోసం గత రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ బోధనను కొన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టింది. కానీ నేటి ప్రభుత్వం వాటిపై నిర్లక్ష్యం వహించడంతో డిజిటల్ బోధనకు అవాంతరాలు తప్పడం లేదు. గత ప్రభుత్వం డిజిటల్ బోధనకు అన్ని ఏర్పాట్లు చేసింది. ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో విద్యా సంవత్సరం ముగుస్తుడడం, ఎన్నికలు రావడంతో అది ఆగిపోయింది. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇంటర్‌నెట్ సౌకర్యం రాలేదు. దాంతో డిజిటల్ బోధనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాం తో ఉపాధ్యాయులే తమ సెల్‌ఫోన్‌లో హాట్ స్పాట్ ఆన్ చేసి ఆ డేటా ద్వారా పాఠాలు బోధిస్తున్నారు.

**తొలుత 8,9, 10 తరగతులకు..**

ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు 2022–23 విద్యా సంవత్సరంలో డిజిటల్ పాఠశాలలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. విద్యార్థులకు డిజిటల్ బోర్డుపై వీడియోలు చూపిస్తూ బోధించడం ద్వారా సులువుగా అర్థమవడంతోపాటు ఎక్కువ కాలం గుర్తుండిపోతుందని దీనిని అమలు చేసింది. తొలుత 8,9,10 తరగతుల విద్యార్థులకు డిజిటల్ బోధన చేపట్టాలని నిర్ణయించినా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. 2023 మార్చిలో కొన్ని పాఠశాలలకు డిజిటల్ బోర్డులు మంజూరయ్యాయి. అప్పటికే విద్యాసంవత్సరం పూర్తవుతుండటంతో కొన్ని చోట్ల వాటిని నామమాత్రంగా ఉపయోగించారు. మరి కొన్ని చోట్ల భద్రపరిచి 2023–24 విద్యాసంవత్సరం ఆరభంలో ఏర్పాటు చేశారు. అదే విద్యా సంవత్సరంలో అన్ని ఉన్నత పాఠశాలలకు బీఎస్‌ఎన్‌ఎల్ కేబుల్ ద్వారా ఇంటర్‌నెట్ కల్పిస్తామని చెప్పారు. నేటికీ కల్పించలేదు. కొందరు ఉపాధ్యాయులు హాట్‌స్పాట్ ఉపయోగిస్తున్నా నెట్ సిగ్నల్ సరిగా రాక పాఠాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి.

**భద్రపరచడం కొంత కష్టమే..**

ప్రభుత్వ పాఠశాలకు ప్రభుత్వం అందించిన డిజిటల్ ప్యానల్ బోర్డులు ఒక్కొక్కటి సుమారు రూ. 3.50 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు ఉంటాయి. పాఠశాలల్లో వాటిని భద్రపర్చాలంటే ప్రధానోపాధ్యాయులకు కత్తిమీద సాములాంటిదే. అనేక పాఠశాలలు ఊరికి దూరంగా ఉండటంతో వాటికి రక్షణ లేకుండా పోతున్నది. తాళాలు వేసినా కొన్ని పాఠశాలలో కంప్యూటర్స్‌తోపాటు ఇతర సామగ్రి చోరీకి గురయ్యాయి. ఇప్పుడు ఇంత విలువైన ప్యానల్స్‌ను జాగ్రత్తగా ఉంచడం కష్టంగానే ఉందని ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులు కాపలాదారులను నియమించారు. ఆ తర్వాత వారి ఊసే లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం డిజిటల్ బోధన చేసే విధంగా నెట్ సౌకర్యం కల్పించడంతోపాటు వాటి రక్షణ కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు కోరుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో మంజూరైన డిజిటల్ బోధన బోర్డులు**

| జిల్లా | ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు | మంజూరైన డిజిటల్ బోర్డులు |
|---|---|---|
| సూర్యాపేట | 210 | 644 |
| యాదాద్రి | 183 | 875 |
| నల్లగొండ | 289 | 536 |

### పూర్తిస్థాయిలో నెట్ సౌకర్యం కల్పించాలి



తరగతి గదిలో డిజిటల్ బోధనతో పాఠాలు చెప్పడంతో ఎంతో మంచిగా అర్థమవుతున్నాయి. కానీ కొన్ని సమయాల్లో నెట్ సక్రమంగా రాకపోవడంతో పాఠాలు మధ్యలోనే ఆగిపోతున్నాయి. అలా కాకుండా పూర్తి స్థాయిలో డిజిటల్ బోధన చెప్పే విధంగా పాఠశాలలకు ప్రభుత్వమే నెట్ సౌకర్యం కల్పించాలి.

**-నికిత, 9వ తరగతి, పెంచికల్‌దిన్నె జడ్పీహెచ్‌ఎస్, నేరేడుచర్ల**

### ఫోన్ నుంచి హాట్‌స్పాట్ ఉపయోగించాల్సి వస్తున్నది



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడం కోసం డిజిటల్ బోర్డులను ప్రభుత్వం ఇచ్చింది. వాటిపై పాఠ్యాంశాలను చెప్తున్నాం. కానీ నెట్ కనెక్షన్ సౌకర్యం కల్పించక పోవడంతో మా ఫోన్లలో సొంతంగా నెట్ బ్యాలెన్స్ వేయించి హాట్‌స్పాట్ ఉపయోగించి బోధిస్తున్నాం. నెట్ స్పీడ్ సరిపోక విద్యార్థులకు కొద్దిమేర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

**-శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, పెంచికల్‌దిన్నె, జడ్పీహెచ్‌ఎస్, నేరేడుచర్ల**

## చారిత్రక శిల్పాలను కాపాడుకోవాలి

- నాగార్జున సాగర్‌లో 13వ శతాబ్ది కళాఖండాలను భద్రపర్చాలి
- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



హిల్‌కాలనీలోని ఆలయ ఆవరణలో నిరుపయోగంగా పడి ఉన్న శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

నందికొండ, డిసెంబర్ 18 : చారిత్రక శిల్పాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈఓ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత ఏలేశ్వర మాధవ స్వామి ఆలయ ఆవరణలో నిరుపయోగంగా పడి ఉన్న శిల్పాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1954–1960 సంవత్సర మధ్య కాలంలో నాగార్జునసాగర్ జలాశయ నీటి ముంపు ప్రాంతమైన ఏలేశ్వర నుంచి తరలించి శిల్పాలను ఇక్కడికి చేర్చారన్నారు. ఈ శిల్పాలలో 700 సంవత్సరాల నాటి నంది, ఆలయ ద్వార శాఖలు, రెండు సహస్ర లింగాలు లాంటివి నిరుపయోగంగా గత 65 ఏండ్లుగా పడి ఉన్నాయని తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత గల 13వ శతాబ్ది కళాఖండాలను భద్రపరిచి, భావి తరాలకు అందించాలని ఆలయ అధికారులను కోరారు.



సైన్స్ ఫెయిర్‌కు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

## నేటి నుంచి సూర్యాపేట జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

కోదాడ టౌన్, డిసెంబర్ 18 : సూర్యాపేట జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల 19, 20 తేదీల్లో కోదాడ పట్టణంలోని సీసీఆర్ పాఠశాలలో నిర్వహించనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సూర్యాపేట జిల్లా సైన్స్ అధికారి ఎల్. దేవరాజ్, కోదాడ మండల విద్యాధికారి ఎండీ సలీంషరీఫ్ తెలిపారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కోదాడ, హుజూర్‌నగర్ డివిజన్లకు సంబంధించిన ప్రదర్శనల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు మిగిలిన డివిజన్ల వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు. 19న ఉదయం 9: 30 గంటలకు వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభమవుతుందని, అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కోకరికులమ్ కార్యక్రమాల పోటీలు వ్యాసరచన, డిబేటింగ్, క్విజ్ నిర్వహిస్తారని తెలిపారు. వివిధ కమిటీలకు సంబంధించిన కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులు, ప్రదర్శనలకు సంబంధించిన విద్యార్థులతో గైడ్ టీచర్స్ సకాలంలో కోదాడలోని సీసీరెడ్డి పాఠశాలకు చేరుకోవాలని చెప్పారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె ఉధృతం



నల్లగొండ కలెక్టరేట్ ఎదుట మంత్రి కోమటిరెడ్డి ఫొటోలతో నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

## 9వ రోజూ కొనసాగిన నిరసన దీక్ష

- మంత్రి కోమటిరెడ్డి ఇచ్చిన హామీ ఏమైందంటూ ప్లకార్డులతో ప్రదర్శన
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలో నిలిచిన విద్యాబోధన
- త్వరలో జరిగే టెన్త్, ఇంటర్ పరీక్షలపై తీవ్ర ప్రభావం
- సమ్మెలో 2,192 మంది ఉద్యోగులు

రామగిరి, డిసెంబర్ 18 : విద్యాశాఖలో పాఠశాల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమగ్ర శిక్షలో వివిధ హోదాల్లో కీలక భూమిక పోషిస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసన దీక్షలు బుధవారానికి 9వ రోజుకు చేరాయి. గతంలో సమ్మె చేస్తున్న సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీ ఏమైందని, అధికారంలోకి వచ్చిన తర్వాత మర్చిపోయారా? అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫొటో ప్లకార్డులతో ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. సమ్మెకు బీజీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు పీఆర్‌టీయూ అర్బన్ శాఖ అధ్యక్షుడు శంకరయ్య, పలు సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమగ్ర శిక్ష విభాగంలో పని చేస్తున్న 2,192 మంది ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో ఎమ్మార్సీలు, భవిత సెంటర్స్ తలుపులు తెర్చుకోక తాళాలతో దర్శనమిస్తున్నాయి. మరో వైపు కేజీబీవీలో విద్యార్థులకు బోధన సాగడంలేదు. పాఠశాల స్థాయి నుంచి పూర్తి సమాచారం సేకరించే సీఆర్‌పీలు, జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షలో పని చేసే ఉద్యోగులంతా సమ్మెలో ఉండటంతో విద్యాశాఖ కార్యక్రమాలు కుంటుపడుతున్నాయని చెప్పవచ్చు. కాంగ్రెస్ తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని రోజుల తరబడి సమ్మె చేస్తున్నా రేవంత్‌రెడ్డి సర్కార్ స్పందించడం లేదని, సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన కొసాగిస్తామని ఉద్యోగులు స్పష్టం చేస్తున్నారు.

**పది, ఇంటర్ పరీక్షలపై ప్రభావం**

కాంప్లెక్ స్థాయిలో విద్యా కార్యక్రమాలను పాఠశాలలకు, ఎమ్మార్సీలకు.. అక్కడి నుంచి డీఈఓ కార్యాలయానికి చేరవేసే క్లస్టర్ రీసోర్స్‌పర్సన్స్ సమ్మెలో కొనసాగుతుండంతో విద్యాశాఖ అమలు చేస్తున్న సమాచారం పాఠశాలలకు చేరడం లేదు. జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఏపీఓ, అకౌంటెంట్స్‌తో పాటు కేజీబీవీలో టీచర్స్, పాఠశాలలో పని చేసే పార్ట్‌టైం టీచర్స్ విధులకు హాజరుకాకపోవడంతో ఈ ప్రభావం త్వరలో జరుగబోయే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలపై ప్రభావం పడనుంది. నల్లగొండ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 59 ఉన్న కేజీబీవీల్లో పనిచేసే ప్రత్యేకాధికారులు(ఎస్ఓ), టీచర్స్, బోధనేతర సిబ్బంది 691 మంది సమ్మెలో పాల్గొంటున్నారు. దీంతో ఆయా పాఠశాలలో 9 రోజులుగా పాఠ్యాంశాల బోధన నిలిచిపోయింది. కేవలం రోజూ ఒక టీచర్, పీఈటీ, ఏఎన్‌ఎంలు విధులు నిర్వహిస్తుండగా, వంట సిబ్బంది వంట చేసి పెడుతున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లోని 7వేలకుపైగా విద్యార్థులంతా హాస్టల్ గదులకే పరిమితమయ్యారు. ఇక ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవలందించే ఐఈఆర్‌పీలు, ఉమ్మడి జిల్లాలోని 100 భవిత సెంటర్స్ మూతపడటతో 8వేలకు మందికిపైగా విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారింది.

### ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆమోదించాలి



సమగ్రశిక్ష ఉద్యోగులు చాలీచాలని జీతాలతో జీవితం గడుపుతున్నారు. తాము సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా బాధాకరంగా ఉంది. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే బిల్లు పెట్టి ఆమోదించాలి. మంత్రులు సైతం మా సమస్యలపై మాట్లాడాలని వేడుకుంటున్నాం. సమస్యలు పరిష్కరించే వరకు ఐక్యంగా ఉండి సమ్మె కొనసాగిస్తాం.

**- మొలుగురి కృష్ణ, సమగ్రశిక్ష ఉద్యోగులు సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు**

### ఇతర రాష్ట్రాల్లో రెగ్యులర్ చేశారు



సమగ్ర శిక్ష ఉద్యోగులంతా సమ్మెలో ఉండడంతో విధులకు హాజరుకావడం లేదు. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా జిల్లా విద్యాశాఖ– సమగ్రశిక్షలో విధులు నిర్వహిస్తున్నాం. ఒడిశా, మహారాష్ట్ర, హర్యానాలో మా లాంటి ఉద్యోగులను అక్కడి ప్రభుత్వాలు క్రమబద్ధీకరించాయి. అక్కడి మాదిరిగా రెగ్యులర్ చేసి మా కుటుంబాల్లో వెలుగులు నింపాలి.

**- భిక్షమా చారి, అకౌంటెంట్ కం డేటా ఎంట్రీ ఆపరేటర్, సమగ్రశిక్ష జిల్లా కార్యాలయం**

### హోదాకు తగిన వేతనం లేదు



గురుకులాల్లో పనిచేసే ప్రిన్సిపాల్స్‌తో సమానంగా కేజీబీవీల్లో పని చేస్తున్నాం. మా సర్వీసులు రెగ్యులర్ చేయాలి. కేజీబీవీలో పనిచేస్తున్న ప్రత్యేకాధికారులకు(ఎస్ఓ) ప్రిన్సిపాల్‌గా హోదా కల్పించాలి. సమ్మెలో ఉన్నప్పటికీ మా పాఠశాలలో ఉండే విద్యార్థులకు రక్షణ కల్పిస్తూనే భోజనం, వసతులు కల్పిస్తున్నాం. మరో వైపు మోడల్ స్కూల్ హాస్టళ్లకు ఇన్‌చార్జీలుగా వ్యహరిస్తూ వారికి కూడా ప్రభుత్వ ఆదేశాల మేరకు పర్యవేక్షిస్తున్నాం. కానీ సమాన పనికి సమాన వేతనం, హోదా అందించడంలేదు. ఇది చాలా అన్యాయం. మాపై దయతో ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి.

**- డి.విజయశ్రీ, ఎస్ఓ, కేజీబీవీ, గుర్రంపోడు**

### రెసిడెన్షియల్ టీచర్లతో సమానంగా పనిచేస్తున్నాం



ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో బోధన సిబ్బంది మాదిరిగానే మేము 24 గంటలు విధుల్లో ఉంటున్నాం. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నాం. చేసే పని కొండంతా, ఇచ్చే నెల జీతం మాత్రం గోరంత. వెట్టిచాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వానికి ఇది తగదు. మహిళలు మా ఆడబిడ్డలంటూనే ఆ మహిళా ఉద్యోగులనే సర్కార్ పట్టించుకోకపోవడం చాలా బాధాకరం.

**- బి.సుజాత, పీఈటీ, కేజీబీవీ కట్టంగూర్**

### సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పట్టవా?



సమగ్ర శిక్షలో ఐఈఆర్‌పీ టీచర్స్‌గా పనిచేస్తున్నాం. ఏండ్ల తరబడి పిల్లల భవిష్యత్తు కోసం పనిచేస్తున్నా సర్కార్ పట్టించుకోవడంలేదు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్నాం. వారికిస్తున్న లక్షల వేతనాలు కాకపోయినా మాకు కనీస వేతనాలు కూడా ఇవ్వరా..? ఇంత దారుణంగా వెట్టిచాకిరీ చేయించుకుంటారా? ఇప్పటికైనా ఇచ్చిన హామీలు అమలు చేయాలి. లేకుంటే ఐక్యంగా ఉంటూ సమ్మెలోనే కొనసాగుతాం.

**- కంచర్ల ప్రమీళ , ఐఈఆర్‌పీ, సమగ్ర శిక్ష, చండూర్ మండలం**